'పెనుగొండ'లో వడగళ్ల వాన

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒకసారిగా ఆకాశం మేఘావృతమై వడగళ్ల వాన కురిసింది. దేవ, ఇలపర్రు, సిద్ధాంతం గ్రామాల పరిధిలో ఈ వర్షం కురిసింది. దీంతో వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికొచ్చే తరుణంలో వర్షం పంటను దెబ్బతీస్తుందని వారు వాపోతున్నారు.

కురుస్తున్న వర్షం

'ధాన్యం' టెన్షన్..!

- ముమ్మరంగా రబీ ధాన్యం మాసూళ్లు
- వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన
- సరిపడా గోనె సంచులు అందుబాటులో లేని పరిస్థితి
- ధాన్యం కొనుగోలు లక్ష్యంలో కోత.. కొనుగోలు చేయకపోతే ఎలా?
- ఏలూరు జిల్లాలో 23 వేలు, పశ్చిమలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 48 గంటల్లోపే ధాన్యం సొమ్ము జమతో రైతుల్లో సంతృప్తి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వరి రైతులను ధాన్యం టెన్షన్ వెంటాడుతోంది. వాతావరణ మార్పులతో ఈదురుగాలులు, వర్షం కురుస్తుండటంతో అన్నదాత ఆందోళనకు గురవుతున్నాడు. మరోపక్క సరిపడా గోనె సంచులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడం, ధాన్యం కొనుగోలు లక్ష్యాలు కుదించడం అన్నదాత గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రబీ మాసూళ్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రబీలో పశ్చిమలో 2.21 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా దాదాపు 40 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ఇప్పటి వరకూ 30 వేల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం కొనుగోళ్లు సాగాయి. ఏలూరు జిల్లాలో 80 వేల ఎకరాల్లో వరి సాగు సాగగా ఇప్పటి వరకూ 15 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. 23 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. కొనుగోలు చేసిన ధాన్యం సొమ్ము 48 గంటల్లోపే జమ కావడంతో రైతుల్లో సంతృప్తి నెలకొంది. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగడంతో, రబీలోనూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు సాగుతుందని రైతులు ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వంలో ధాన్యం సొమ్ము నెల తరబడి జమయ్యేది కాదు. దీంతో రైతులు అయినకాడికి దళారులకు అమ్ముకునేవారు. ధాన్యం సొమ్ము ఒకటి, రెండు రోజుల్లోనే జమ కావడంతో రైతులు సైతం రైతుసేవా కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం మాత్రం టార్గెట్లు నిర్ణయించి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

ధాన్యం కొనుగోలు టార్గెట్లలో కోత

ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ఒకపక్క చెబుతూనే మరోపక్క జిల్లాల వారీగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి టార్గెట్లు పెట్టింది. ఏలూరు జిల్లాలో రబీలో 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వం మాత్రం తొలుత లక్షా 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పింది. అయితే ఇప్పుడు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యమే

కొనుగోలు చేస్తామని చెబుతోంది. దిగుబడిలో సగం ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తామని చెబుతుండటంతో మిగిలిన లక్షా 97 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతులు ఎవరికి అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపారులకు అమ్ముకుంటే ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర దక్కని పరిస్థితి. పశ్చిమగోదావరి జిల్లాలో తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కొనుగోలు టార్గెట్ మాత్రం ఆరు లక్షల మెట్రిక్ టన్నులే ఇచ్చారు. మరి మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేయాలి. అయినకాడికి దళారులకు అమ్ముకోవాల్సిందేనా అనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానం లేకుండాపోయింది. ధాన్యం సొమ్ము సకాలంలో ఇచ్చి, మద్దతు ధర వస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకుండా పక్కకు తప్పుకోవాలని చూడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

గోనె సంచుల కొరత ఎదుర్కోవాల్సిందేనా..?

గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న ప్రధాన సమస్యల్లో గోనె సంచుల కొరత ఒకటి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖరీఫ్‌లో గోనె సంచుల కొరత రాకుండా చూసుకున్నారు. రబీలో మాత్రం గోనె సంచులపై సరైన ప్రణాళిక లేకుండా ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఏలూరు జిల్లాలో 55 లక్షల వరకూ గోనె సంచులు అవసరం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు మాత్రం జరగలేదని స్పష్టంగా కనిపిస్తోంది. ఒక మండలానికి అవసరమైన సంచుల్లో నాలుగోంతులో ఒక వంతు సంచులు మాత్రమే రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. 16 లక్షల సంచులు అవసరం ఉంటే నాలుగు లక్షల సంచులు మాత్రమే ఇచ్చిన పరిస్థితి ఉంది. ఖరీఫ్‌లో మాత్రం ముందుగానే సరిపడా సంచులను అందుబాటులో ఉంచారు. ఖరీఫ్ కంటే రబీలో దిగుబడి ఎక్కువగా వస్తోంది. సంచుల అవసరం ఎక్కువగా ఉంటుంది. జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా సంచులు మాత్రం సరిపడా లేవని క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి తెలుస్తోంది. వాతావరణ మార్పులతో రైతులు మాసూళ్లు త్వరగా పూర్తి చేయాలని చూస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ధాన్యం అందుబాటులోకి వచ్చే పరిస్థితి ఉంది. దీంతో సంచుల కొరత రైతులను వెంటాడే పరిస్థితి ఉందనే ఆందోళన సర్వత్రా నెలకొంది. అదే జరిగితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడనుంది. అధికారులు సంచుల ఏర్పాట్లపై తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పశ్చిమలో కొంతమేర సంచులు అందుబాటులో ఉన్నప్పటికీ ధాన్యం ముమ్మరంగా వస్తే ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని చెప్పొచ్చు.

సహకార సంఘాల సేవలు మరింత విస్తృతం

- 73 సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి
- జిల్లాలో 1.63 లక్షల మందికి ఇకెవైసి పూర్తి
- సొసైటీల ద్వారా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- జిల్లా సహకార శాఖాధికారి ఎం.నాగరాజు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో సహకార సంఘాల సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు జిల్లా సహకార శాఖాధికారి ఎం.నాగరాజు తెలిపారు. వాణిజ్య బ్యాంకుల తరహాలో సహకార సంఘాల సేవలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ఆదేశాల మేరకు పారదర్శకతను పెంపొందించేందుకు వీలుగా జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ చేపట్టామని తెలిపారు. కంప్యూటరీకరణ పూర్తయిన తర్వాత ప్రజలకు ప్రధానంగా రైతాంగానికి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. జిల్లాలోని 73 సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయ్యిందన్నారు. సహకార రంగంలో రైతులకు ఎన్నో ప్రయోజనాలను చేకూర్చేలా సమగ్ర రుణ ప్రణాళికను అమలు చేస్తున్నామని చెప్పారు. సహకార సంఘాల అభివృద్ధి, అందిస్తున్న సేవలు, కంప్యూటరీకరణ, ఇకెవైసి వంటి అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో డిసిఒ నాగరాజు వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని సహకార సంఘాలు ఉన్నాయి. ఎంతమంది సభ్యులు ఉన్నారు?

డిసిఒ: జిల్లాలోని 20 మండలాల్లో 122 సహకార సంఘాలు ఉన్నాయి. అలాగే ఆరు కోఆపరేటివ్ బ్యాంకులు, అర్బన్ బ్యాంక్ ఒకటి, తణుకులో వాణిజ్య బ్యాంక్ దానికి అనుసంధానంగా మరో నాలుగు బ్యాంకులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 1.92 లక్షల మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న: సహకార సంఘాల ద్వారా ఎటువంటి సౌకర్యాలు అందిస్తున్నారు?

డిసిఒ: కేంద్ర సహకార చట్ట పరిధిలో సహకార సంఘాలు పని చేస్తున్నాయి. సకాలంలో సాగు సమయాన అధిక వడ్డీలకు రైతులు అప్పు చేయకుండా తోడ్పాటు అందిస్తున్నాం. ఖరీఫ్, రబీ సీజన్లో కూడా రైతులకు పంట రుణాలందిస్తున్నాం. ఎక్కడైనా రుణాలు తిరిగి చెల్లించకుండా మొండి బకాయిదారులు ఉన్నచోట రుణాలు చెల్లించడం కొంత ఆలస్యం కావొచ్చు. అయితే మిగిలిన అన్ని పరపతి సంఘాల పరిధిలో రుణాలు మంజూరు చేస్తున్నాం. దీనికితోడు వాణిజ్య గ్రామీణ బ్యాంకులకు ధీటుగా సహకార బ్యాంకు సేవలను విస్తృతం చేస్తున్నాం.

ప్రశ్న: సహకార సంఘాల కంప్యూటరీకరణ ఎంతవరకు వచ్చింది. ఎటువంటి సేవలు అందుబాటులో ఉన్నాయి?

డిసిఒ: జిల్లాలో 122 సహకార సంఘాలకు 73 సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయ్యింది. మరో 10 రోజుల్లో నూటికి నూరుశాతం కంప్యూటరీకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. బ్యాంకు ఖాతాదారులకు సౌకర్యాలను మెరుగుపర్చాం. సహకార బ్యాంకు పరిధిలో భీమవరం, యండగండి వంటి ప్రాంతాల్లో ఎటిఎం సేవలు అందుబాటులోకి తీసుకొచ్చాం. డిజిటల్ ఆధారిత సేవల్లో సాంకేతికతను అనుసంధానం చేస్తున్నాం. ప్రాథమిక సహకార పరపతి సంఘాలను కంప్యూటరీకరించడంతో అవినీతిని కట్టడి చేయడానికి వీలవుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. గతంలో బ్యాంకు సేవలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించారు. ఇప్పుడు ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం.

ప్రశ్న: ఎంపీ ఎఫ్‌సి గొడౌన్ నిర్మాణాలు ఎన్ని పూర్తయ్యాయి. ఎంత వెచ్చించి నిర్మాణాలు చేపడుతున్నారు?

డిసిఒ: జిల్లాలో 24 ఎంపీ ఎఫ్‌సి గొడౌన్ల నిర్మాణం చేపట్టడం జరిగింది. వీటిలో 14 గొడౌన్ల నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి వచ్చాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. త్వరలో నిర్మాణాలు పూర్తి చేస్తాం. ఈ ఎంపీ ఎఫ్‌సి గొడౌన్ల నిర్మాణానికి రూ.1.40 కోట్లు వెచ్చిస్తున్నాం. నాబార్డ్ ద్వారా నిధులు సమకూర్చడం జరుగుతుంది. అలాగే సహకార ఈ సమృద్ధి పథకంలో భాగంగా వరల్డ్ స్టోరేజ్ గొడౌన్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించాం. త్వరలో వీటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సంఘాల అభివృద్ధికి ఏయే చర్యలు చేపట్టారు?

డిసిఒ: జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సంఘాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నాం. దీనిలో భాగంగా జిల్లాలో ఐదు సంఘాల ఆధ్వర్యంలో జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. యండగండి, మొయ్యేరు, ఇరగవరం, వెంప, ఆకివీడు సంఘాల్లో ఏర్పాటు చేశాం. మరో 50 జనరిక్ మందుల షాపుల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశాం. అలాగే మొయ్యేరు, ఏలేటిపాడులో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం.

ప్రశ్న: సహకార సంఘాల ద్వారా ఎంత మేర ధాన్యాన్ని కొనుగోలు చేశారు?

డిసిఒ: గతేడాది రైతు సేవా కేంద్రాల ద్వారా 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ఈ ఏడాది రబీలో 9.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. ప్రస్తుతం ఈ సీజన్లో 6.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని లక్ష్యంగా తీసుకున్నాం.

ప్రశ్న: ఇకెవైసి ఎంతమేర పూర్తయ్యింది? ఇకెవైసి వల్ల ప్రయోజనం వివరించగలరు?

డిసిఒ: జిల్లాలో 1.92 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 1.63 లక్షల మందికి ఇకెవైసి పూర్తి చేశాం. ఇంకా సుమారు 28 వేల మందికి ఇకెవైసి చేయాల్సి ఉంది. సహకార సంఘాల్లో ఒకే వ్యక్తి రెండు, మూడు చోట్ల తమ భూములు ఉంటే అన్నిచోట్లా గతంలో సభ్యత్వాలు ఉండేవి. ఇటువంటి సభ్యత్వాల వల్ల కొన్ని పొరపాట్లకు తావుంటుందని భావించి ప్రభుత్వం సభ్యులందరికీ ఇకెవైసి తప్పనిసరి చేసింది. దీంతో సభ్యులు తప్పనిసరిగా తమ సభ్యత్వానికి ఇకెవైసి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ఖరీఫ్ సీజన్లో పంట రుణాలు ఇచ్చే సమయంలో ఇ-క్రాప్ నమోదు చేశాం. దాని ఆధారంగానే సభ్యుల ఇకెవైసి చేపట్టాం. సచివాలయాల్లో ప్రక్రియ చేపట్టాం. ఎక్కడైనా ఇకెవైసి చేయించుకోని రైతులు ఉన్నట్లయితే తప్పనిసరిగా సచివాలయాల్లోను, సహకార పరపతి సంఘాల సిబ్బందిని సంప్రదించాలి. సంఘాల పరిధిలో నకిలీ డాక్యుమెంట్లతో భూమి లేని వారు కూడా రుణాలు పొందడానికి వీలుండేది. ఇకెవైసి అనుసంధానం తర్వాత అటువంటి పొరపాట్లకు తావుండదు. ఇకెవైసి అనుసంధానించిన తర్వాత నేరుగా రైతు సెల్‌ఫోన్‌కు ఒటిపి వస్తుంది. ఆ ఒటిపి ఆధారంగా సభ్యులుగా డిజిటల్‌లో రిజిస్టర్ అవుతున్నారు. భూములున్న రైతులు ఏదైనా కారణం చేత మృతి చెందితే వారి వారసులకు భూములు వారసత్వంగా సంక్రమిస్తాయి. మృతి చెందిన రైతులు మాత్రం ఇంకా సహకార సంఘాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. వారి స్థానంలో వారసులకు సభ్యత్వం మార్చుకునేందుకు వీలవుతుంది. భూములు క్రయవిక్రయాల తర్వాత మ్యూటేషన్ చేసుకోక, రికార్డుల్లో పేర్లు మార్చుకోని వారికి ఇది సమస్యగా ఉంటుంది. ఇటువంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఇకెవైసి తప్పని సరిచేశాం.

ఆక్వా రైతుల ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- సాగులో నిబంధనలు పాటించాలి
- దాతల భాగస్వామ్యంతో ల్యాబ్ ఏర్పాటు
- డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంపీ బీదా మస్తాన్‌రావు

మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఉండి

రైతు శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని ఉండి, ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక కోట్ల ఫంక్షన్ హాలులో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా రైతుల సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కనుమూరి రఘురామకృష్ణంరాజు, బీదా మస్తాన్‌రావు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. తొలుత ఎంపీ బీదా మస్తాన్‌రావు మాట్లాడుతూ తాను కూడా ఆక్వా రైతునని, 1200 ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నానని తెలిపారు. ప్రతి ఆక్వా రైతులానే తాను కూడా ప్రస్తుతం నష్టాలను చవిచూశానన్నారు. ఆక్వా రైతుల కోసం తాను 33 శాతం ప్రోటీన్లతో కూడిన మేతను రూ.62కే రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసేలా సిఎం చంద్రబాబుతో మాట్లాడతానన్నారు. ఉండి నియోజకవర్గంలో ఆక్వా ల్యాబ్ ఏర్పాటుకు రూ.80 లక్షలు స్థానిక ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు అందజేస్తానని హామీ ఇచ్చారు. యూనిట్ విద్యుత్ రూ.రెండుకే అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తాను కోరుతున్నానన్నారు. రైతులకు అవసరమైతే తనకున్న రెండు ఫీడ్ ప్లాంట్లలో ఒకటి ఇస్తానని, తనకు ఫీడ్ తయారీకి అయ్యే ఖర్చు మాత్రమే ఇస్తే సరిపోతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఫిషరీస్ రీసెర్చ్ సెంటర్ ఉందని, దానిని ఆక్వా రైతులందరూ వినియోగించుకోవాలని సూచించారు. మంగళవారం జరిగే సదస్సులో ఆక్వా ఎగుమతిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాన్ని ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఫీడ్ బస్తా తయారీకి సుమారు రూ.70 ఖర్చవుతుంటే దానిని రూ.2500కుపైబడి అమ్మడం ద్వారా రైతులను ఫీడ్ కంపెనీలు దోచుకుంటున్నాయని విమర్శించారు. ఫీడ్ ధరలను అదుపుచేయడంలో గత ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుత ప్రభుత్వం దానిపై దృష్టి సారించాలని అన్నారు. సాధారణంగా ఏప్రిల్, మే, జూన్‌లోనే సాగు ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలోనే మద్దతు ధర తగ్గిపోతుందని, సంవత్సరం పొడవునా ధరల స్థిరీకరణకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ప్రతి మండలంలోని ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులకు ఉపయోగపడేలా గతంలో కృషి విజ్ఞాన కేంద్రంలో రూ.4 కోట్లతో ఏర్పాటు చేసిన ఆక్వా రీసెర్చ్ సెంటర్ నిరుపయోగంగా ఉందని, జిల్లా కలెక్టర్ సహకారంతో దానిని పూర్తిస్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రైతులు సీడ్, ఫీడ్‌లను పరీక్షించి కొనుక్కునేందుకు బిఎంఆర్ అధినేత, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు రూ.80 లక్షలు సొంత నిధులు ఇస్తానని చెప్పడం, మేతను రైతులు సొంతంగా తయారు చేసుకునేందుకు అవసరమైతే తన ఫీడ్ ప్లాంట్ ఒకటి రైతులకు ఉచితంగా అందిస్తానని చెప్పడం ఆనందదాయకమన్నారు. రైతులందరూ నిబంధనలు పాటించి సాగు చేపడితే నష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడదన్నారు. ప్రతి రైతూ నిబంధనలకు అనుగుణంగా మూడు మీటర్లు వదిలి తవ్వకాలు ప్రారంభించాలని, తద్వారా పంట కాలువలోకి మురుగునీరు వెళ్లకుండా మురుగు బోదెలు ఏర్పాటు చేసుకోగలుగుతారన్నారు. మురుగునీరు పంట కాలవలోకి వెళ్లడం వల్ల నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఆక్వా ఎగుమతిదారులు, ఫీడ్ కంపెనీలు ఐకమత్యంగా ఉండటం వల్ల వారు లాభాల బాట పట్టారని, రైతులు ఎవరికి వారు యమునా తీరే అన్నట్లు ఉండటం వల్లనే నష్టాలను చవిచూడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సుబ్బరాజు, రుద్రరాజు యువరాజు ఆక్వా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దినకర్ కళాశాల విద్యార్థిని కావ్యకు సత్కారం

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు గ్రామంలోని దినకర్ జూనియర్ కాలేజ్(పూర్ణోదయ జూనియర్ కాలేజ్) విద్యార్థిని పంతుల కావ్య జూనియర్ ఇంటర్ ఇంగ్లీష్ మీడియం ఎంపిసి గ్రూపులో 470కి 458 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానం సాధించింది. ఈ సందర్భంగా కాలేజీ పాలకవర్గం, ప్రిన్సిపల్ ఘనంగా సత్కరించారు. ఆదివారం సాయంత్రం ఈ వేడుక కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇసి గ్రూపులో ఎం.బిందు మాధవి 500కి 416 మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానంలో నిలిచింది దీంతో ఇరువురిని యాజమాన్యం సత్కరించారు. వారి విద్యా ప్రగతికి సహకరించిన తల్లిదండ్రులను సైతం ఘనంగా సత్కరించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పులిగెడ్డ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ జక్కంశెట్టి ప్రభాకర్, సత్యనారాయణ, అధ్యాపకులు సిహెచ్.వాణి, ఎం.రవికుమార్, జె.ఫణింద్ర, ఇ.రామారావు, ఎం.రమేష్ రెడ్డి, బి.త్రిమూర్తులు, ఎ.శ్రీనివాసు, నాన్ టీచింగ్ సిబ్బంది ఎ.కృష్ణసాయి, రాజ్యలక్ష్మి, సిహెచ్.పోతురాజు పాల్గొన్నారు.



కావ్యను సత్కరిస్తున్న పాలకవర్గం

పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఎం ఆధ్వర్యాన నిరసనలు

మొగల్లులో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తక్షణ తగ్గించాలని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రియ్య డిమాండ్ చేశారు. మొగల్లులో సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం పెంచిన ధరలు తగ్గించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలం టభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా నినదించారు. అనంతరం ఆశ్రియ్య మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఇంకెన్నిసార్లు పెంచుతారని ప్రశ్నించారు. ఇప్పటికే అనేక పర్యాయాలు పెంచి మళ్లీ ధరలు పెంచడం అత్యంత దుర్మార్గమన్నారు. తమ ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే పెంచిన ధరలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు ధరలు పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల వెంకటస్వామి, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆచంట : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను పెంచడానికి నిరసిస్తూ ఆదివారం సాయంత్రం ఆచంట వేమవరం పొంతలో ముసలమ్మ గుడి వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అన్నింటా ధరలను పెంచి ప్రజల జీవితాలను అతలాకుతలం చేస్తుందని విమర్శించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా దీనికి అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాలను తగ్గించవలసిన కేంద్ర ప్రభుత్వం సామాన్య పేద ప్రజలపై ఈ రకమైన భారాలు వేయడం దారుణమని మండిపడ్డారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకం రద్దు చేయాలని, భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖా కార్యదర్శి గుత్తుల రంగారావు, మండల కమిటీ సభ్యులు కుసుమ జయరాజు, మచ్చ సుబ్బారావు, నేతలు బండి రంగారావు, సిర్రా విగ్నేశ్వరుడు, మైలే వెంకట్రావు, గెద్దాడ త్రిమూర్తులు, జిల్లెల్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆచంట వేమవరంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

గణపవరం : పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సిపిఎం అప్పన్నపేట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పంచాయతీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నేత బసవా ఎర్రినాయుడు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు వల్ల పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. జోగి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ఈ నెల 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మండల స్థాయిలో కూడా పిజిఆర్ఎస్ కార్యక్రమం జరగదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ నాగరాణి కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ప్రతిభావంతులైన క్రీడాకారులు ఉన్నతస్థానాలు చేరుకునేందుకు క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించి వారిని ప్రోత్సహిస్తామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెంలో గత 13 రోజులుగా నిర్వహించిన బొలిశెట్టి క్రికెట్ లీగ్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ యువత చదువుకే పరిమితం కాకుండా క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. బొలిశెట్టి క్రికెట్ లీగ్ నిర్వాహకులతోపాటు గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూడా క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందని గుర్తు చేశారు. తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటును వచ్చే ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. వాటి ద్వారా రాష్ట్రస్థాయి లీగ్‌లు కూడా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించి తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా క్రీడలు నిర్వహించే ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైతే తానే స్వయంగా స్పాన్సర్‌షిప్ చేస్తామని హామీ ఇచ్చారు. 13 రోజులపాటు 44 టీములు తలపడి ఫైనల్‌కు చేరిన పండు లైన్స్, అజయ్ ఎలివేన్స్ టీం సభ్యులను బొలిశెట్టి శ్రీనివాస్ అభినందించారు. బొలిశెట్టి క్రికెట్ లీగ్ నిర్వాహకులు బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ బిసిఎల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడంలో చిన్న, కరీం, సలాం వారి మిత్ర బృందం ఎంతగానో కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

సాగరతీరంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో, ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహబంతి భోజనాలు చేసి సేద తీరారు.

బీచ్‌లో సేదతీరుతున్న పర్యాటకులు

రైల్వే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

స్టేషన్ మాస్టర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన ఇంటి మాదిరిగానే మనం ప్రయాణించే ప్రదేశాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రైల్వేస్టేషన్ పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ మాస్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం భారత రైల్వే వారోత్సవాలలో భాగంగా రైల్వే శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో టౌన్ రైల్వే స్టేషన్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు అన్ని రైల్వే స్టేషన్లలో రైల్వే విశిష్టత, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని, ముగింపు రోజున రైల్వే అధికారులకు సత్కారాలు, రైల్వే కార్మికులకు నూతన వస్త్రాలను అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా రాము, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల్లో సహకారం అందించాలి : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరంలోని కాపు సామాజిక తరగతుల్లో ఎందరో సన్నిహితులు ఉన్నారని, ఈ సామాజికంగా వెనుకబడిన వారికి ప్రోత్సాహం అందించి విద్య, వైద్య రంగాల్లో చేయూతనిచ్చి ఐక్యతగా సాగాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో మన వారి కోసం మనం పేరుతో కాపు సామాజిక తరగతుల ప్రముఖులు నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. తాను కెజిఆర్ఎల్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో స్టూడెంట్ యూనియన్ ఎలక్షన్లలో జాయింట్ సెక్రటరీగా పోటీ చేశానని, క్షత్రియ సామాజిక వర్గం నుంచి తాను ఒక్కడినే విద్యార్థిని అయినప్పటికీ కాపు సామాజిక వర్గం విద్యార్థుల సహకారంతో విజయం సాధించానని గుర్తు చేసుకున్నారు. తన తండ్రి పేరిట ఏర్పాటు చేస్తున్న ట్రస్టు ద్వారా అవసరమైన వెనుకబడిన కాపు సామాజిక వర్గ విద్యార్థులకు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. పిఎసి చైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, మన వారి కోసం మనం అధ్యక్షులు గన్నాబత్తుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు చినిమిల్లి వెంకట రాయుడు, ఉపాధ్యక్షులు అడపా బాబ్జి, కార్యదర్శి ఆరేటి ప్రకాష్, కోశాధికారి వడుపు గోపి పాల్గొన్నారు. ఇటీవలే ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన డాక్టర్ చుండూరు మల్లీశ్వరిని, పలువురిని సత్కరించారు.

16న చేగొండికి అభినందన సభ

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈనెల 16వ తేదీ బుధవారం సాయంత్రం 4:30కు పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్‌లో ఉగాది పురస్కార గ్రహీత చేగొండి వీరవెంకట సత్యనారాయణ మూర్తికి అభినందన సభ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు యర్రంశెట్టి వెంకటరత్నం తెలిపారు. సకల కళాస్ఫూర్తి మూర్తిని రసధుని, నటినట సంక్షేమ సమాఖ్య, హరివిల్లు, కళాంజలి నృత్య నికేతన్, పాలకొల్లు కళాపరిషత్, శ్రీకళాధరి నట దామం సంయుక్త నిర్వహణలో ఈ అభినందన సత్కారం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

కృష్ణభారతి సంస్మరణ సభలో కలెక్టర్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక కల్లి రామచంద్రరావు కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పసల కృష్ణభారతి సంస్మరణ సభలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. స్వాతంత్ర సమరయోధులు, గాంధేయవాదులు పసల కృష్ణమూర్తి, అంజలక్ష్మి దంపతుల కుమార్తె పసల కృష్ణ భారతి గతనెల మార్చి 23న మరణించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని పసల కృష్ణభారతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ నాగరాణి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జూన్ 9న బండి ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు : ముత్యాలపల్లిలో వేంచేసియున్న బండిముత్యాలమ్మ జాతర మహోత్సవ నిర్వహణకు తేదీ ఖరారు చేశారు. అమ్మవారి జాతర ప్రతి మూడేళ్లకు ఒక పర్యాయం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దీంట్లో భాగంగా ఈ సంవత్సరం జూన్ ఆఖరు లోపు నిర్వహించాల్సి ఉంది. ముత్యాలపల్లి రెవెన్యూ గ్రామంలోని ముత్యాలపల్లి, మోడి, వారతిప్ప గ్రామాల ప్రజలు సమావేశమై జాతర తేదీ నిర్ణయించడం ఆనవాయితీ. ఇప్పటికే మూడు పర్యాయాలు సమావేశమయ్యారు. తేదీ నిర్ణయానికి సాంకేతిక కారణాలతో అంగీకారం కుదరలేదు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో తేదీ ఖరారు చేశారు. జూన్ నెల 9న సోమవారం రాత్రి జాతర నిర్వహించేందుకు తీర్మానించారు. మే నెల 4న అమ్మవారిని నిలబెట్టడం, 7న కరాటం చెల్లాపురం పొట్టుచంద్రరావు కుమారుడు జ్యోతి వెలిగించడం, 8న అమ్మవారు బ్రాహ్మణుల ఇంటి సందర్శన, చిక్కాలవారి ఇంటి సందర్శన చేయనున్నారు. అనంతరం జాతర వరకూ అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. జూన్ 8న అమ్మవారికి దాసరివారి కుటుంబాలకు చెందిన మనసులు గాని ఇంటివద్ద గవలగుమ్ము నిర్వహించనున్నారు. 9న జాతర, 10న అమ్మవారిని ఏడిపనకూ సాగనంపడంతో జాతర మహోత్సవం ముగియనుంది. 14న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఇప్ప రామకుమార్, ఆలయకమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, గ్రామాల పెద్దలు కొల్లాటి రాజారావు, దాసరి బాబి, నిప్పులేటి తారకరామారావు, బొక్కా వెంకట్రావు, దొంగ యుగంధర్, కడలి మధుసూదనరావు, కొల్లాటి కనకసుబ్బారావు, కర్రి వీరాస్వామి, సాధనాల రాంబాబు, తిరుమాని నాగేశ్వరరావు, నాగిడి శ్రీరాములు ఆలయ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నసమారాధన

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులోని రాజగోపాలస్వామి, రామాలయం ఆలయ ప్రాంగణంలో ఆదివారం భారీ అన్న సమారాధన చేశారు. జీవీఎల రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి, సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి మోకా అరుణకుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎఐటియుసి నాయకులు నాగేశ్వరావు మృతి

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం వర్కర్స్ యూనియన్ నాయకులు, సిపిఐ శేషమ్మచెరువు గ్రామశాఖా కార్యదర్శి జక్కంశెట్టి నాగేశ్వరావు(68) అనారోగ్యంతో గుంటూరు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు వున్నారు. జక్కంశెట్టి నాగేశ్వరరావు మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో టైం స్కేల్ వర్కర్‌గా విధులు నిర్వహించి రిటైర్ అయ్యారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం కార్మిక సంఘం కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఎఐటియుసి తణుకు ఏరియా ఉపాధ్యక్షునిగా, జిల్లా సమితి సభ్యునిగా, సిపిఐ తణుకు ఏరియా కమిటీ సభ్యునిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన స్వగ్రామం ఆచంట మండలం శేషమ్మచెరువు సిపిఐ గ్రామ శాఖా కార్యదర్శిగా వున్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆచంట మండల కార్యదర్శి సెలా పూర్ణ చంద్ర జోషి, నాయకులు జక్కంశెట్టి సీతారామయ్య, పెద్దిరాజు నాగేశ్వరావు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. జక్కంశెట్టి నాగేశ్వరావు అంత్యక్రియలు ఆదివారం శేషమ్మచెరువు గ్రామంలో నిర్వహించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

తల్లీ కుమారుడు అదృశ్యం

కేసు నమోదు

ప్రజాశక్తి - కాళ్ల

భీమవరం కళాశాలకు వెళ్లిన మహిళ, ఆమె కుమారుడు కనబడకుండా పోయిన సంఘటన కాళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాళ్లకూరు గ్రామానికి చెందిన పుదింపు దివ్య(27), ఆమె కుమారుడుతో కలిసి ఈనెల 10వ తేదీన భీమవరం కెజిఆర్ఎల్ కళాశాలకు వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దివ్య భర్త భాస్కర్ రావు కాళ్ల పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గృహ నిర్మాణాలు వేగవంతం చేసి లబ్ధి పొందాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద ఎన్‌టిఆర్ గృహనిర్మాణ లబ్ధిదారులందరూ వేగవంతంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవడం ద్వారా తమకు దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల హౌసింగ్ శాఖ ఏఇ అండే కనక మల్లేశ్వరరావు కోరారు. ఈమేరకు ఆయన ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : మండలంలో మంజూరైన లే అవుట్స్ ఎన్ని?

ఎఇ : మండలంలో 43 లేఅవుట్స్ మంజూరై, ప్రభుత్వంచే గుర్తింపు పొందాయి.

ప్రశ్న : మండలానికి ఎన్ని గృహాలు మంజూరు అయ్యాయి?

ఎఇ : మొత్తం మండలంలోని 18 రెవెన్యూ గ్రామాలు, కొన్ని పెద్ద గ్రామాలకు ఉన్న శివారు గ్రామాల్లో మొత్తం 2,271 గృహాలు మంజూరు అయ్యాయి.

ప్రశ్న : ప్రస్తుతం మంజూరు అయిన గృహాల వాస్తవ పరిస్థితి ఎలా ఉంది?



హౌసింగ్ ఎఇ ఎకె.మల్లేశ్వరరావు

ఎఇ : మొత్తం 2,271 గృహాల్లో 826 గృహాలు పూర్తి అయ్యి, గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి. 445 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. 860 గృహాల నిర్మాణం ఇంకా ప్రారంభించలేదు.

ప్రశ్న : గ్రామాల వారీగా కాలనీ లేఅవుట్స్ సంఖ్యలు ఎలా ఉన్నాయి?

చిట్ - చాట్

ఎఇ : కాలనీ లేఅవుట్స్ సంఖ్యాపరంగా పెనుమంట్ర, ఆ గ్రామ శివారు గ్రామాల్లో 6, పొలమూరు, సత్యవరం గ్రామాల్లో 3 చొప్పున, మార్టేరు, నెలమూరు, భట్లమగటూరు, ఓడూరు, వెలగలేరు, నెగ్గిపూడి, జుత్తిగ, సోమరాజు ఇల్లింద్రపర్రుల్లో రెండేసి చొప్పున, మిగిలిన మల్లేశ్వరం, మాముడూరు, వెలగలవారి పాలెం, కొయ్యేటి పాడు, గరువుల్లో ఒక్కో లేఅవుట్లు ఉన్నాయి.

ప్రశ్న : గృహ నిర్మాణం జరిపే లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే సాయం ఎలా ఉంటుంది?

ఎఇ : ప్రభుత్వం యూనిట్ కాస్ట్ కింద ఒక్కో గృహానికి రూ.లక్షా 50 వేలు, లెంటిన్ నిర్మాణానికి రూ.12 వేలు, ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం కింద ఇచ్చేది పూర్వం రూ.18 వేలు కాగా, ప్రస్తుతం రూ.27 వేలు ఇస్తుంది.

ప్రశ్న : కొత్త ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఏమైనా అదనపు లబ్ధి ప్రకటించారా?

ఎఇ : ఈ పథకం కింద గృహ నిర్మాణం చేసుకొనే బిసి, ఎస్‌సి లబ్ధిదారులకు అదనంగా రూ.50 వేలు, ఎస్‌టి లబ్ధిదారులకు అదనంగా రూ.75 వేల లబ్ధిని ప్రభుత్వం ప్రకటించింది.

ప్రశ్న : లబ్ధిదారుల గృహ నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తిచేయాలి?

ఎఇ : వాస్తవానికి ఈ ఏడాది మార్చికి పూర్తి కావాలి. అయితే ఎక్కువ గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నందున ఏప్రిల్ 30 వరకు కాల పరిమితి పెంచారు.

ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఇంటర్ ఫలితాల్లో తిరుమల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో భీమవరం తిరుమల జూనియర్ కాలేజ్ విద్యార్థులు అత్యద్భుతమైన ఫలితాలు సాధించారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. కళాశాలలో ఆదివారం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఫలితాల వివరాలను వెల్లడించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి విభాగంలో 470 మార్కులకు వివి.మణికంఠ సత్యసాయి 466 మార్కులతో భీమవరం పట్టణంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవటంతో పాటు ఒకరికి లేదా ఇద్దరికి కాకుండా 24 మందికి 465 మార్కులు రావటం అత్యద్భుతమైన ఫలితాలు సాధించటానికి నిదర్శనమని తెలియజేశారు. 460కుపైగా సాధించిన వారు 155 మంది, 450కుపైగా సాధించిన వారు 345 మంది, 440పైగా సాధించిన వారు 452 మంది, 420పైగా సాధించిన వారు 622 మంది, 400 పైగా సాధించిన వారు 739 మంది అలాగే బైపిసి విభాగంలో 440 మార్కులకు కె.శ్రావ్య, జి.హాసిని రిత్విక, జి.మనస్విని 434 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, పి.జ్యోషిక శ్రీవల్లి 433, కె.మధునయన, కె.ప్రజ్ఞ ప్రిస్కిల్ల 432 మార్కులు, సిహెచ్.లెహర్ష, సిహెచ్.రేవతి, జె.విద్య 431 మార్కులు సాధించగా, 430పైగా మార్కులు సాధించినవారు 12 మంది, 420పైగా సాధించిన వారు 27 మంది, 400పైగా 51 మంది సాధించారని తెలియజేశారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు ఎండి అశ్రఫ్ 990 మార్కులతో మొదటి స్థానం కైవసం చేసుకోగా, కె.విమల్, కె.మణికంఠ రెడ్డి, కె.సాయి హర్షిక్, కెఎన్.హాసిని, కెబిఎస్-ఎల్.ప్రత్యూష 989 మార్కులతో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. 980పైగా మార్కులు సాధించినవారు 99 మంది, 970పైగా సాధించినవారు 228 మంది, 960పైగా సాధించిన వారు 340 మంది, 900పైగా సాధించిన వారు 703 మంది, బైపిసి విభాగంలో 1000 మార్కులకు యు.శరణ్య 988 మార్కులతో ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, సిహెచ్‌బిఎల్.ప్రసన్న, కె.శేషశ్రీ 987 మార్కులు, పి.భవ్యశ్రీ, ఒపి.దుర్గా ప్రసాద్ 986 మార్కులు సాధించగా, 970పైగా మార్కులు సాధించినవారు 22 మంది, 950పైగా సాధించిన వారు 39 మంది, 900పైగా సాధించిన వారు 61 మంది అని తెలియజేశారు. విద్యాసంస్థల డైరెక్టర్స్ ఎస్.సాయిరాజు, పి.శ్రీనివాసవర్మ, జి.సతీష్ బాబు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం ఉత్తీర్ణత 96.8 శాతం, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 99.1 శాతం సాధించారని, ప్రథమ, ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలియజేస్తూ, ఈ ఫలితాలను సాధించిన విద్యార్థులకు, సిబ్బందికి అభినందనలు, తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ధన్యవాదాలు తెలియజేశారు.

రేషన్ డీలర్లకు జీవన భద్రత కల్పించాలి

రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి సాయి రామకృష్ణ

ప్రజాశక్తి - పాలకోడేరు

దేశమంతటా ఒకే కమిషన్ అమలు చేసి రేషన్ డీలర్లకు తగిన జీవన భద్రత కల్పించాలని పాలకోడేరు మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సోము సాయి రామకృష్ణ కోరారు. పెన్నాడ గ్రామంలో ఆదివారం విచ్చేసిన కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనకు రేషన్ డీలర్లు ఎదుర్కొన్న సమస్యలను సాయిరామకృష్ణ వివరించారు. తమ రేషన్ డీలర్లు కేంద్రం పరిధిలోని జాతీయ ఆహార భద్రత పథకంలో వున్నామన్నారు. తమను రాత పరీక్షల ద్వారా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించి ఎంపిక చేసారని గుర్తుచేశారు. రాష్ట్రంలో 29,500 మంది ఉన్నామని తెలిపారు. అయితే తాము చాలీచాలని ఆదాయంతో జీవన సంక్షోభం ఎదుర్కొంటున్నామని వివరించారు. తమకు ప్రభుత్వం అమలు చేస్తున్న కనీస వేతన చట్టం ప్రకారం కూడా ఆదాయం రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఒకే కమిషన్ అమలు చేసి డీలర్ల సంక్షేమానికి కృషిచేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ డీలర్ల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు.



కేంద్ర సహాయ మంత్రితో మాట్లాడుతున్న రామకృష్ణ

విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహకం



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - పెనుగొండ

ఇంటర్మీడియట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్థానిక ఎస్‌పికెపి అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో యాజమాన్యం రూ.5 వేల చెక్కులను అందజేశారు. గ్రూప్(ఏటి) కొండవీటి ఆదిత్య యశస్వి(987), పెదపూడి సుప్రియ బైపిసి మార్కులు(984) సాధించిన విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఈ చెక్కులను ఆదివారం ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా కళాశాలలో పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం గ్రూప్ పెదపూడి సుప్రియ డాక్టర్ కావాలని, కొండవీటి ఆదిత్య యశస్వి చార్టెడ్ అకౌంటెంట్‌తో పాటు కంపెనీ సెక్రటరీ కావాలని, తమిరిసి సుబ్రహ్మణ్యం సివిల్స్ సాధించాలని ఆశీర్వదించారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెవిఆర్.సూర్యనారాయణ, కాలేజీ ప్రెసిడెంట్ తాడి నాగిరెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్ర రాజు, పాలకవర్గ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనాటి జ్ఞాపకాలు.. ఈనాటి మధుర క్షణాలు

వేంద్రలో 25 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

పాలకోడేరు : వారంతా ఎక్కడో పుట్టారు.. ఎక్కడో పెరిగారు.. కానీ ఒకే చోట కలిసి చదువుకుని 25 ఏళ్ల తర్వాత ఎక్కడైతే చదువుకున్నారో ఆ పాఠశాలలోనే కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ.. ఈనాటి మధుర క్షణాలను గుండెల్లో పదిలంగా దాచుకున్నారు. ఈ అరుదైన, మధురమైన ఘటనకు వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 1999 - 2000 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. పదో తరగతి పూర్తిచేసుకుని 25 ఏళ్లు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేసుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా చదువుకున్న పాఠశాలకు వచ్చి ఆనాటి స్నేహితులను కలుసుకుని మురిసిపోయారు. పాత జ్ఞాపకాల మధుర సమ్మృతులు గుర్తుచేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకుని ఆలింగనం చేసుకున్నారు. వయసును సైతం మర్చిపోయి ఆనాటి విద్యార్థులు లాగా ఒదిగిపోయారు. ఆటపాట, మాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పించి తమ ఉన్నతికి పునాదులు వేసిన గురువులను పూర్వపు విద్యార్థులంతా సత్కరించారు. చదువుకున్న పాఠశాలకు బీరువాను బహూకరించి భవిష్యత్తులో పేద విద్యార్థులకు విద్యలో చేయూతనివ్వాలని నిర్ణయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అవధులు లేకుండా ఆనందంతో గడిపిన పూర్వ విద్యార్థులంతా పాఠశాలను వదలాలని లేకున్నా బరువెక్కిన గుండెతో వెళ్లారు.

పూర్వపు విద్యార్థులు

చెట్ల తొలగింపు పేరుతో విధ్వంసం

పాలకోడేరు విద్యుత్ శాఖ అధికారుల తీరుపై విమర్శలు

భీమవరం : గొల్లలకోడేరు పంచాయతీ పరిధిలోని ఎఎస్ఆర్ నగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో విధ్వంసం సృష్టించారు. విద్యుత్తు తీగలకు అడ్డు లేకపోయినా విలువైన మొక్కలు, చెట్లను అతి దారుణంగా తొలగించారు. గొల్లలకోడేరులో 11 కెవి విద్యుత్ లైన్ల మీద ఉన్న చెట్లు, కొమ్మలు, కొబ్బరి ఆకులు తొలగించేందుకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు శనివారం ప్రకటన ద్వారా విద్యుత్ వినియోగదారులకు తెలియజేశారు. అయితే చెట్లు కొమ్మలు, కొబ్బరి ఆకుల తొలగింపు మాట ఎలా ఉన్నా విద్యుత్ లైన్లకు ఇబ్బంది లేకుండా ఉన్న, పెరట్లో పెంచుకున్న విలువైన మొక్కలను ప్రోక్లైన్‌తో అతి దారుణంగా తొలగించేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా జెసిబి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతోనే చెట్లను తొలగించి ఉంటారేమోనని బదులిచ్చారు. . దీనిపై పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ వాసులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమయ్యారు.

చలివేంద్రాలు ప్రారంభం

తణుకు : తణుకు పట్టణం, పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు తణుకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభించినట్లు తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఆదివారం తణుకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో 5 చలివేంద్రాలను ఎంఎల్ఏ రాధాకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా సేవా దృక్పథంతో వాటిని కొనసాగించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పెరుగుతున్న ఎండలకు అనుగుణంగా ప్రజలకు దాహార్తి తీర్చేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

ఎస్ఎంసి సభ్యులతో గ్రామాల్లో ర్యాలీ

కాళ్ల : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి - కాళ్ల

నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధించే ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకటసుబ్బరాజు కోరారు. మన ఊరి బడి-మన ప్రభుత్వ బడిలో మన పిల్లలు కార్యక్రమంలో భాగంగా సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్పెషల్ ఆదివారం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకట సుబ్బరాజు నాయకత్వంలో ఉప సర్పంచి బొంతు మాణిక్యాలరావు, ఎస్ఎంసి ఛైర్మన్ తెనాలి అశోక్ బాబు సహకారంతో అంగన్వాడీ టీచర్ కె.రమాదేవి, ఉపాధ్యాయులు బొబ్బిలి రాజమౌళి, కోటేశ్వరస్వామి, ఎస్ఎంసి సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని రెండు చర్చిలను సందర్శించి అక్కడ హాజరైన అందరికీ మన ప్రభుత్వ పాఠశాలలో అమలు అవుతున్న కార్యక్రమాలు, పిల్లల పట్ల తీసుకునే శ్రద్ధ, చక్కని బోధన తదితర విషయాలపై వారికి వివరించారు. మన పాఠశాల మోడల్ పాఠశాలగా మారుతున్న సందర్భంగా పిల్లలందరినీ సీసలి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల స్పెషల్‌లో చేర్పించాలని కోరారు. ఈ బడిబాట కార్యక్రమంలో మోడల్ ప్రాథమిక పాఠశాలగా రూపుదిద్దుకోనున్న మా బడిలో ఇప్పటి వరకు 18 మంది అడ్మిషన్ ఫారాలు తగు సమాచారంతో పూర్తిచేసి ఇవ్వడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు అడ్డాల వెంకట సుబ్బరాజు వివరించారు.

ఆకివీడు : ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశామని, ఉచితంగా విద్యను అందిస్తామని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చి వారి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని యుటిఎఫ్ మండల కార్యదర్శి ఆర్‌వి.నారాయణ(విక్రమ్) విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు గాను యుటిఎఫ్ సంకల్పించిన కార్యక్రమంలో భాగంగా ఆదివారం అజ్జమూరు గరువు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్‌వి. నారాయణ ఈ కార్యక్రమం చేపట్టారు. తమ విద్యార్థులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాల ప్రత్యేకతలను వివరించారు. 2025-2026 విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చేరుటకు మీకు మా ఆహ్వానం అంటూ పాఠశాల ప్రత్యేకతను వివరించారు. 100 శాతం ఇంగ్లీష్ మీడియం, తల్లికి వందనం ప్రతి విద్యార్థికి వర్తిస్తుందన్నారు. 'మనబడి - మన భవిష్యత్తు' కార్యక్రమం ద్వారా ఫ్యాన్‌లు, టాయిలెట్లు, ఇంగ్లీష్ ల్యాబ్‌లు, ఆర్‌సిసి భవనాలు, విశాలమైన తరగతులు, ఫర్నిచర్, మౌలిక సాదుపాయలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర ద్వారా విద్యార్థులకు 3 జతల యూనిఫాం, స్కూల్ బ్యాగ్, బూట్లు ఉచితం, నోట్స్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పథకంతో మధ్యాహ్న భోజనం అమలవుతోందని వివరించారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్యను అందిస్తామని, ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. ఈ ఇంటింటి పర్యటనలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్‌పర్సన్ మజ్జి రాజేశ్వరి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ధనలక్ష్మి, శైలజ, అప్పల నరసమ్మ, స్వర్ణలత, జి.శ్రీనివాస్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకివీడులో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ మండల కార్యదర్శి నారాయణ

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెద్దతాడేపల్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్, 5వ తరగతి ప్రవేశ పరీక్షలను ఆదివారం నిర్వహించినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. ఐదవ తరగతి విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్లో ప్రవేశించే విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు పరీక్ష నిర్వహించారు. 5వ తరగతికి జరిగిన ప్రవేశ పరీక్ష సమయంలో ఎంఇఒ-2 పిఎంకె జ్యోతి పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 93 మంది కేటాయించగా 83 హాజరయ్యారని, 10 మంది హాజరు కాలేదని, అలాగే ఇంటర్ సెట్ పరీక్షకు 206 మందికి గాను 182 మంది హాజరయ్యారని, 24 మంది విద్యార్థులు హాజరు కాలేదని ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఇంటర్ ప్రవేశ పరీక్షను జిల్లా గురుకులాల సమన్వయకర్త బి.ఉమాకుమారి సందర్శించారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. **నరసాపురం :** మండలంలోని ఎల్‌బి చర్ల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదవతరగతి, ఇంటర్ మీడియట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఇంటర్ సెట్ పరీక్షకు 125 మంది విద్యార్థులకు 103 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఐదవతరగతి ప్రవేశ పరీక్షకు 53 మంది విద్యార్థులకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని ప్రిన్సిపల్ నల్లి సాయిబాబు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని తహశీల్దార్ ఐవివి.సత్యన్నారాయణ, ఎంఇఒ పి.పుష్పరాజ్యం తనిఖీ చేశారు.

ఘనంగా పలుచోట్ల మట్టల ఆదివారం

కాళ్ల : మండలంలోని పలు గ్రామాల్లో ప్రార్థనా మందిరాల్లో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. సంఘ సభ్యులు, స్త్రీల సమాజం, సండే స్కూలు పిల్లలు యూత్ ఆధ్వర్యంలో ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. సిఎస్ఐ, సిబిసిఎన్‌సి, ఆర్‌సిఎం, బాపిస్ట్, పెంతుకొస్తు, ఇహెచ్‌హెచ్, ఏసుక్రీస్తు ప్రార్థన, లూథరన్ ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవులు ఈత చెట్టు మట్టలతో చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. **తాడేపల్లిగూడెం :** ఈస్టర్ ముందు వారం వచ్చే ఆదివారం మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని క్రైస్ట్ సెంటనరి లూథరన్ చర్చి ఏ క్లాస్ పేరిష్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత చెట్టుకు సంబంధించిన మట్టలను పువ్వులతో అలంకరించుకొని స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా దుర్గా క్లాత్ షోరూం సెంటర్, తారక ఆఫీస్ సెంటర్ మీదుగా క్రైస్తవ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో గురు మండల అధ్యక్షులు రెవ.డి.ఎల్. ఫినేహస్, అడిషనల్ పాస్టర్ వి.రత్నాకర్, పాలకవర్గ సభ్యులు, స్త్రీల సమాజం వారు, యూత్, సండే స్కూల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు గ్రామపంచాయతీ నక్కవారిపాలెం ఆదివారం క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మట్టలకు పూలను అలంకరించి గ్రామంలోని వీధుల్లో సువార్త గీతాలు పాడుతూ సండే స్కూల్ చిన్నారులు ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ టి.కొండయ్య, సిఆర్‌వి.లాజర్, సండే ది స్కూల్ పి.పూజిత, సంఘ పెద్దలు కోణాల ప్రసాదరావు, పిసిసి ఇంజేటి తాతారావు, ఇంజేటి భోగేశ్వరరావు, మోకా మార్కురాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ అందరివాడు

విగ్రహావిష్కరణలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు

ఆచంట : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలు యువతకు మార్గదర్శకమని ఆంధ్రప్రదేశ్ శాసనసభమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్ రాజు అన్నారు. ఆచంట నియోజకవర్గంలోని మాల సంఘాల జెఎసి, నిర్వహణ కమిటీ అధ్యక్షులు సుంకర సీతారామ్ ఆధ్వర్యంలో సర్పంచి కోట సరోజినీ వెంకటేశ్వర అధ్యక్షతన భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆచంటలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొయ్యే మోసేన్ రాజు పాల్గొని మాట్లాడుతూ పేదల ఆశాజ్యోతి, అంబేద్కర్ బాటను నేటితరం నేతలు ఆచరించాలని పిలుపునిచ్చారు. డాక్టర్ సరళ పురుషోత్తం, జెఎసి రాష్ట్ర కన్వీనర్ గుమ్మపు సూర్య వరప్రసాద్, జిల్లెల్ల సత్య సుధా, ఉన్నమట్ల మునిబాబు, యాదల రవి పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

మొగల్తూరు : అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మండల కేంద్రం మొగల్తూరులోని రామాలయం రోడ్డులో ఉన్న టిఆర్‌కె కార్ బజార్‌లో ఆదివారం పాలకొల్లుకు చెందిన ఆపద్బాంధు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయతి సందర్భంగా గత మూడు సంవత్సరాలుగా రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వాహకులు తణుకుల రామకృష్ణ, నల్లి నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆకన ఫణింద్రనాథ్, లయన్స్ మొగల్తూరు శాఖ అధ్యక్షులు వివేక రాంబాబు, వర్ధనపు ప్రసాద్ పాల్గొని రక్తదానం చేసిన యువతకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

విప్ నాయకర్‌ను కలిసిన మత్స్య సహకార కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం

మొగల్తూరు : మత్స్య సహకార కోఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం విప్ బొమ్మిడి నాయకర్‌ను మర్యాదపూర్వకంగా ఆదివారం ఆయన కార్యాలయంలో కలిశారు. అధ్యక్షుడిగా మోకా ఏడుకొండలు, కార్యదర్శి కొల్లాటి ముత్యాలరాజు సభ్యులు బర్రి పెద్దిరాజు, వాటాల సోమరాజు, మోకా రాంబాబు, మల్లాడి వెంకటేశ్వర్లు, కొల్లాటి భోగరాజు, కర్రి భాస్కర్‌రావు, వాటాల లక్ష్మణస్వామిలను నాయకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహాయ సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, కొల్లాటి గోపికృష్ణ పాల్గొన్నారు.

వైసిపి నేతల దుష్ప్రచారం తగదు : ఎంఎల్ఎ

తణుకు : రాష్ట్రంలో మతవిద్వేషాలు రెచ్చగొడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో వంద గోవులు మృత్యువాత పడ్డాయని వైసిపి నేతలు చేస్తున్న అసత్య ప్రచారంపై తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ మండిపడ్డారు. వైసిపి నాయకులు ఓటమి పాలైనప్పటికీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి రాజకీయం చేయడాన్ని, అవాస్తవమైన ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. విలేకరుల లో కూటమి నాయకులు పాల్గొన్నారు.